11 రోజుల దసరా

- ఈ ఏడాది అంగరంగ వైభవంగా దసరా వేడుకలు
- రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు, సాగు పనులు
- నిధుల కొరత లేదు
- ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి
- సన్నాహక సమావేశంలో సీఎం సిద్దరామయ్య


సమావేశంలో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో కావేరి నదికి అనుబంధమైన జలాశయాలు నిండాయని, మైసూరు ప్రాంత ప్రజలు సంతృప్తితో ఉన్నారని ఈ ఏడాది దసరా వేడుకలు ఆడంబరంగా జరుపుదామని సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. శనివారం విధానసౌధలో మైసూరు దసరా2025పై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ ఈ ఏడాది దసరా 11రోజులు కొనసాగనుందన్నారు. దసరా పరంపర మరింత ఆకర్షణీయం చేయాలని అధికారులను ఆదేశించారు. గత ఏడాది రూ.40 కోట్లు గ్రాంటు కేటాయించామని ఈ ఏడాది కూడా నిధులకు కొరత లేదన్నారు. సెప్టెంబరు 22 నుంచి వేడుకలు ప్రారంభమవుతాయని, అక్టోబరు 2న విజయదశమి, జంబూ సవారీ ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ, గ్యారెంటీ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. 10లక్షలమంది ప్రజలు పాల్గొనే అవకాశం ఉందని, విదేశీయులు హాజరవుతారని, అందుకు తగ్గట్టుగా చర్యలు ఉండాలన్నారు. గత ఏడాదికంటే ప్యాలెస్ ముందు తక్కువసీట్లు అమర్చాలన్నారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. చాముండికొండకు, కేఆర్ఎస్ రోడ్లకు మరమ్మత్తు చేయాలన్నారు. జానపద కళల ప్రదర్శనకోసం ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయాలన్నారు. గత ఏడాది విద్యుత్ అలంకరణలు ఆకట్టుకున్నాయని, ఈసారి మరింత ఆకర్షణీయంగా చేయాలన్నారు. అన్ని జిల్లాల శకటాలు వైవిధ్యంగా ఉండాలని, ప్రజలు తిలకించేలా అవకాశం కల్పించాలన్నారు. గందరగోళానికి తావులేకుండా గోల్డ్‌కార్డులు పంపిణీ చేయాలన్నారు. మైసూరు నగరాన్ని సుందరంగా తీర్చాలని, దసరా చూసేందుకు వచ్చేవారికి పార్కింగ్, శౌచాలయ వ్యవస్థలు కల్పించాలన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప మాట్లాడుతూ గత ఏడాది ప్యాలెస్ ముందు 54వేల సీట్లు ఏర్పాటు చేయడం వలన సమస్య ఏర్పడిందన్నారు. మైసూరు దసరా ప్రాధికార ఏర్పాటు చేసి సౌకర్యాలు పెంచాలని స్థానిక ఎమ్మెల్యే తన్వీర్‌సేఠ్ అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురిశాయని, రైతులు సంతోషంగా ఉన్నారని, దసరా వేడుకలు మరింత ఉత్సాహంగా జరపాలని జేడీఎస్ ఎమ్మెల్యే జీటీ దేవేగౌడ అభిప్రాయపడ్డారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు కేజే జార్జ్, శివరాజ్ తంగడిగి, బైరతి సురేశ్‌తోపాటు మైసూరు, మండ్య జిల్లాల ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

పాలవెల్లువ..!




- కోటి లీటర్లు అధిగమించిన కేఎంఎఫ్
- రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన పాలసేకరణ
- రాజధానిలోనే అత్యధికంగా 18లక్షలు..
- తిరుమల లడ్డూ ప్రసాదానికి నందిని నెయ్యి


కేఎంఎఫ్ ప్రధాన కార్యాలయం

బెంగళూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాడి పరిశ్రమ ఉజ్వలంగా సాగుతోంది, పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. సహకారరంగం, ఆర్టీసీ, పాడి ఉత్పత్తిలో దేశానికే కర్ణాటక ఆదర్శంగా నిలుస్తోంది. ఈ విభాగాలలో భిన్నమైన అభివృద్ధి నిరంతరంగా మనుగడతో మూడు విభాగాలు ఆదర్శప్రాయంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో ఆర్టీసీ నాలుగు డివిజన్‌లుగా పనిచేస్తున్నా ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ప్రగతి సాధిస్తోంది. సహకారసంఘాలంటేనే రాజకీయ ప్రభావం ఉంటుందనేది తెలిసిందే. కానీ రాష్ట్రంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారంలో ప్రవేశించినా అవినీతికి భారీ అక్రమాలకు తావులేకుండా వేలాది సహకారసంఘాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్)లు ఆదర్శప్రాయంగా సాగుతున్నాయి. ఇదే కోవలోనే కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) దేశంలోని ఇతర సంస్థలకంటే భిన్నంగా అభివృద్ధి సాధిస్తోంది. కేఎంఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా పాల ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా పర్యవేక్షిస్తోంది. ఏకంగా ఒక్కరోజులో 1.06 కోట్ల లీటర్ల పాలను సేకరించి సరికొత్త రికార్డును నమోదు చేసింది.

రాష్ట్రవ్యాప్తంగా 16 సమాఖ్యలు..

కేఎంఎఫ్‌లో మదర్ డెయిరీ కాకుండా రాష్ట్రవ్యాప్తంగా 16 పాల సమాఖ్యలు ఉన్నాయి. వాటిద్వారా ఈనెల 21న 1,06,54,000 లీటర్ల పాలను సేకరించారు. ఇది కేఎంఎఫ్ చరిత్రలోనే రికార్డుగా నిలిచింది. గత ఏడాది 98.27 లక్షల లీటర్లు పాలు సేకరించింది. కేఎంఎఫ్‌కు బెంగళూరుతోపాటు హాసన్, మండ్యలు బలమైన సమాఖ్యలుగా ఉన్నాయి. బెంగళూరు సమాఖ్య 18.53 లక్షల లీటర్లు, హాసన్ 15.07, మండ్య 12.73 లక్షల లీటర్ల పాలను సేకరించింది.

రైతులకు అదనపు ఆదాయం..

పాడి ఉత్పత్తిద్వారా రైతులు ప్రత్యామ్నాయమైన ఆదాయం పొందుతున్నారు. వ్యవసాయం జీవనాధారమైనా పాడి పశువుల పెంపకం ద్వారా వచ్చే ఆదాయం ఒకప్పుడు అంతంతమాత్రమే అనిపించినా ఇటీవలి కాలంలో ప్రాధాన్యం పెరిగి నెలసరి రెండుసార్లు వేలరూపాయల ఆదాయం గడిస్తున్నారు. ఒకప్పుడు ఒకటి, రెండు ఆవులు మాత్రమే పెంచుకునేవారు. పైగా వ్యవసాయానికే ప్రాధాన్యం ఉండేది. కానీ ఇటీవల దశాబ్దన్నర కాలంలో యువరైతులు పాల ఉత్పత్తివైపు మొగ్గు చూపుతున్నారు. కొందరు యువరైతులు పూర్తిస్థాయిలో సంకరజాతి పాడి ఆవులను పెంచుకుంటున్నారు. డైయిరీ ఫారం పేరిట ఒక్కో చోట 10-20 దాకా ఆవులను పోషిస్తున్నారు. వాటికోసం ప్రత్యేకంగా గడ్డిని సాగు చేస్తున్నారు. గతంలో వివిధ రకాల పంటల సాగుద్వారా లభ్యమయ్యే గడ్డిని వినియోగించేవారు. కానీ ఇటీవలికాలంలో పచ్చిగడ్డితోపాటు పలు రకాల దాణాలను వాడుతున్నారు. పాడి పశువులకు ప్రత్యేకమైన చికిత్స, ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో పాడి ఉత్పత్తిద్వారానే గణనీయమైన లాభం పొందుతున్నారు. కొవిడ్ కాలంలో ఉద్యోగాలు, చిన్నపాటి వ్యాపారాలకోసం వలసవెళ్లినవారు వెనుదిరిగి వచ్చారు. ఈ ప్రభావంతో సుమారు 10 జిల్లాల్లో ప్రతి పల్లెలోనూ నాలుగైదు డెయిరీ ఫారంలు వెలిశాయి.

రైతులకు ప్రభుత్వం ప్రతి లీటరుకు 5 రూపాయల ప్రోత్సాహధనంతోపాటు పాడి పశువుల కొనుగోళ్లకు రుణాలు ఇస్తున్నారు. చెరుకు, వరి, రాగి, జొన్న వంటి పంటలసాగుతో గ్రాసానికి సమస్య లేదు. పైగా ప్రతి పాడిరైతు అనుకూలంగా కొంత గడ్డిని సాగు చేస్తున్నారు. లీటరు పాలు రూ.35 నుంచి 50వరకు ధర పలుకుతోంది. పాలసేకరణ కేంద్రాల నిర్వహణకు లీటరుకు 85 పైసల చొప్పున చెల్లిస్తుండడంతో అదికూడా లాభదాయకంగానే ఉన్నాయి.

విస్తారంగా వర్షాలు..

2024 జూన్ 28న 1.09 కోట్ల లీటర్ల పాల సేకరణ సాధ్యమైంది. ఆ ఏడాదిలో కేవలం ఒకరోజు మాత్రమే పాలదిగుబడి రికార్డు నమోదైంది. ప్రస్తుతం మే 23నుంచి నిత్యం కోటి లీటర్లకంటే ఎక్కువ పాలు ఉత్పత్తి కొనసాగుతోంది. పాలధర లీటరుకు 4రూపాయలు పెంచడంతోపాటు రూ.5 ప్రోత్సాహకధర అందిస్తున్నందున పాడిరైతులు ఎక్కువగా పాలను సమాఖ్యలకే అందజేస్తున్నారు. ఈ ఏడాది వేసవి ప్రభావం కొన్నిరోజులు మాత్రమే సాగింది. ఏప్రిల్ నుంచే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వర్షం కురవడంతోపాటు మే, జూన్ నెలల్లో విస్తారంగా వానలు సాధ్యమయ్యాయి. రాష్ట్రంలోని అన్ని జలాశయాలు దాదాపు నిండేస్థాయికి చేరుకున్నాయి. పైగా ఖరీఫ్ సీజన్‌లో పంటలసాగు జోరుగా సాగుతోంది. పచ్చగడ్డితోపాటు ఎండుగడ్డి కూడా ఈ ఏడాది ఢోకాలేదని పాడిరైతులు అభిప్రాయపడుతున్నారు.

శ్రీవారి ప్రసాదానికి నందిని నెయ్యి



నిత్యం లక్షలాది మంది దివ్య ప్రసాదంగా స్వీకరించే తిరుమల లడ్డూకు కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌కు అనుబంధమైన నందిని బ్రాండ్ నెయ్యిని వాడుతున్నారు. వివిధ కారణాలతో తిరుమల ప్రసాదానికి గడిచిన ఐదారేళ్లపాటు నందిని నెయ్యిని ఉపయోగించలేదు. ఇందుకు టెండర్లు, ఇతరత్రా అంశాలు కారణంగా చూపినా ఇతర కంపెనీలనుంచి నెయ్యి ని కొనుగోలు చేశారు. కల్తీ నెయ్యి వాడారనే వివాదం దేశవ్యాప్తంగా సంచలనమైన విషయం తెలిసిందే. 2019 నుంచి తిరుమలకు నందిని నెయ్యి నిలిపివేశారు. అయితే ఇటీవల 10లక్షల కేజీల నెయ్యి అవసరంగా తిరుమల తిరుపతి దేవస్థానం, కేఎంఎఫ్‌తో ఒప్పందం చేసుకుంది. ఇందులో 2.50 లక్షల కేజీలు, మండ్య జిల్లా పాల ఉత్పత్తిదారుల సమాఖ్య నుంచే ఎగుమతి చేశారు. ఇదే తొలిసారి కేఎంఎఫ్, పాలసమాఖ్యల ద్వారా నేరుగా నెయ్యి సమకూర్చే అవకాశం కల్పించింది. గతంలో కేఎంఎఫ్, యలహంకలోని మదర్ డెయిరీలనుంచే నెయ్యిని పంపేవారు. అయితే సోమవారం మండ్య నుంచి 13,100 కేజీల నెయ్యిని టీటీడీకి పంపే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్టు మండ్య జిల్లా పాలసమాఖ్య అధ్యక్షుడు యూసీ శివకుమార్ తెలిపారు.

అత్యధిక లీటర్ల పాల దిగుబడి జిల్లాలు

జిల్లా	లక్షల లీటర్లు
బెంగళూరు	18.63
హాసన్	15.07
మండ్య	12.73
తుమకూరు	10.55
మైసూరు	9.94
శివమొగ్గ	8.63
కోలారు	7.78
చిక్కబళ్ళాపుర	5.40
దక్షిణకన్నడ	4.19
చామరాజనగర్	3.23
బళ్ళారి	2.41
బెళగావి	2.28
ధారవాడ	2.01
విజయపుర	1.56
కలబురగి	0.67

ఏ క్షణంలోనైనా..!

- తుంగభద్రకు జలకళ
- ఎప్పుడైనా నదికి నీరు : బోర్డు అధికారులు


నీటితో తొణికిసలాడుతున్న తుంగభద్ర డ్యాం

బళ్లారి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తుంగభద్రమ్మ ఒడికి గంగమ్మ పరవళ్లు తొక్కుతూ చేరుతోంది. మలెనాడు, తుంగ, భద్ర, డ్యాం కు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వరద ఉధృతి పెరిగింది. ఏక్షణమైనా తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్లు తెరిచి నదికి నీరు వదులుతామని తుంగభద్ర బోర్డు అధికారులు శనివారం ప్రకటించారు. నదీపరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. రైతులు, పశు, మేక, గొర్రెకాపర్లు, మత్స్యకారులు ఎవరూ నది వైపు వెళ్లరాదని సూచించారు. డ్యాం నుంచి ఏక్షణంలోనైనా నదికి 25 వేల క్యూసెక్కుల నీరు మళ్లిస్తామని తెలిపారు. టీబీ డ్యాంలో అధికారుల నీటి లెక్కల ప్రకారం శనివారం 61.889 టీఎంసీల నీరు చేరింది. ఇన్‌ఫ్లో 65వేల క్యూసెక్కులు పైగా నమోదు అయ్యింది. పస్తుతం డ్యాం కు గేట్లు ఉన్న పరిస్థితుల్లో 80 టీఎంసీలకు మించి నీరు నిల్వ చేయరాదని క్రస్ట్ గేట్లు తయారీ నిపుణులు, సీడబ్ల్యూసీ బృందం వివరించింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నదికి మళ్లిస్తున్నట్లు బోర్డు వర్గాలు తెలిపాయి. నదీ పరివాహ ప్రాంతంలో ఉండే బళ్లారి, కొప్పళ, రాయచూరు, విజయనగర జిల్లాల ప్రజలకు కలెక్టర్లు అప్రమత్తం చేశారు.

జూన్‌లోనే కేఆర్ఎస్‌కు వాయనం

- సీఎం సిద్దరామయ్య మరో రికార్డు
- 84 ఏళ్ల తర్వాత ఈ నెలలో గరిష్ఠ నీటి మట్టం

బెంగళూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం సిద్దరామయ్య మరిన్ని రికార్డులు నమోదు చేయనున్నారు. ఇప్పటికే అత్యధికసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎక్కువకాలం పాలన సాగించిన సీఎంగాను నిలిచారు. తాజాగా రాష్ట్ర చరిత్రలో జూన్ నెలలోనే కేఆర్ఎస్ ప్రాజెక్టుకు వాయనం సమర్పించే తొలి ముఖ్యమంత్రి కానున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలకు ముందే కేరళ రాష్ట్రంతో పాటు కొడగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఈ ప్రభావం తో కావేరి నదికి అనుబంధమైన అన్ని జలాశయాలకు భారీగా వరద చేరింది. కేఆర్ఎస్ 120 అడుగుల లక్ష్యం దాటింది. శనివారం ఉదయానికి 123 అడుగులకు చేరింది. సోమవారం గానే గరిష్ఠనీటిమట్టం సాధ్యం కానుందని అంచనా వేశారు. అదే రోజు కేఆర్ఎస్ డ్యాంకు సీఎం వాయనం సమర్పించనున్నారు. 84ఏళ్ల తర్వాత జూన్‌లో 120 అడుగుల గరిష్ఠనీటిమట్టం చేరడం ఇదే తొలిసారి. 1979 నుంచి కేఆర్ఎస్ డ్యాంకు ముఖ్యమంత్రులు వాయనం సమర్పించే సంప్రదాయం ప్రారంభమైంది. అప్పటి ముఖ్యమంత్రి దేవరాజ్ అరసు తొలిసారి వాయనం సమర్పించారు.


కేఆర్ఎస్ డ్యామ్

శాసనాలే రాజ్యాంగానికి మూలం

- జేబులో పెట్టుకోవడం కాదు.. ఆచరించాలి
- బీసీలను మోసం చేసిన కాంగ్రెస్: కేంద్ర పర్యావరణ శాఖా మంత్రి భూపేంద్రయాదవ్


ఎంపీ పీసీ మోహన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు

బెంగళూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శాసనాలే రాజ్యాంగానికి మూలాధారమని కానీ కొందరు జేబులో పెట్టుకుని ఆత్మలో పెట్టుకున్నట్టుగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ బీసీలకు నిరంతరంగా మోసం చేసిందని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి భూపేంద్రయాదవ్ అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయజాగృతి వేదిక ఆధ్వర్యంలో శనివారం భారతీయవిద్యాభవన్‌లో 'కులగణన ముందు... వెనుక' అనే అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. సామాజిక, విద్యకోసం వెనుకబడినవర్గాలను గుర్తించాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగం సూచించిందన్నారు. ఇందుకోసమే కాకాకాలేకర్ కమిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. కమిషన్‌ను అంగీకరించని పార్టీకి చెందినవారు జేబులో పెట్టుకుని తిరుగుతున్నారన్నారు. దేశంలో ఎమెర్జన్సీ, కుటుంబ రాజకీయం ముగిసిన తర్వాత కేంద్రంలో జనతాపార్టీ మండలకమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మండల కమిషన్‌ను దారి తప్పించిందన్నారు. రాజీవ్‌గాంధీ ప్రధాని అయినప్పుడు 400మంది బీసీ ఎంపీలు ఉన్నారని, కానీ సామాజికన్యాయం కల్పించలేదన్నారు. వెనుకబడినవర్గాలను పట్టించుకోనందునే యూపీ, బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారం కోల్పోయిందన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి కే భక్తవత్సలం మాట్లాడుతూ.. రాజ్యాంగంలో సామాజిక న్యాయపరంగా అందరూ సమానమన్నారు. దేశ జనాభా ఎక్కువని, కులగణన కీలకమైనదన్నారు. ఇది అంతసులువు అయినది కాదన్నారు. బీసీమోర్చా అధ్యక్షుడు రఘుకౌటిల్యతోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ఎంపీలు గోవింద కారజోళ, సీపీమోహన్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కేంద్రమంత్రి బీజేపీ ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్‌లో ఓబీసీలకు నిరంతరంగా మోసం చేసిందన్నారు. బీసీలకు రిజర్వేషన్ సమగ్రంగా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో కులగణన జరిపిన కాంతరాజ్ నివేదికను అమలు కాలేదని, అది ముస్లింలకు ప్రాధాన్యం ఇచ్చేలా రూపొందించారన్నారు. బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. కులగణనకు 165 కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు చేశారని మండిపడ్డారు.


వేదికపై కేంద్రమంత్రి భూపేంద్రయాదవ్

తట్టా బుట్టతో..!

- ఇంటి వసతికోసం పలుమార్లు అధికారులకు వినతి
- స్పందించకపోవడంతో పంచాయతీ కార్యాలయం ముందు వృద్ధురాలి నిరసన


హిరే హడగలి పంచాయతీ కార్యాలయం ముందు బైఠాయించిన దేవక్క

కంప్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని హిరే హడగలి గ్రామానికి చెందిన నిరాశ్రయురాలైన ఓపేద మహిళ కురవర దేవక్క శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఇంటి స్థలం ఇవ్వాలని ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా కురవర దేవక్క మాట్లాడుతూ గతకొన్ని సంవత్సరాలుగా తమకు ఇల్లు లేక పూరి గుడిసెలోనే నివాసం వుంటూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. ఏటా పంచాయతీకి వినతిపత్రాలు అందజేస్తున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు, నాయకులు పట్టించుకోనందునే తట్టా, బుట్టా తెచ్చుకుని పంచాయతీ కార్యాలయం ముందు నిరసనకు దిగానన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరింది.

ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవలోనే!

- మాజీ ప్రధాని దేవెగౌడ
- గ్యారెంటీలతో అభివృద్ధి సాధ్యం కాదని అభిప్రాయం

8

కృష్ణానదిలో పెరిగిన వరద ప్రవాహం


తెరుచుకున్న నారాయణపూర్ డ్యాం గేట్లు

పైపులు వేశారు..రోడ్డు మరిచారు..

చేళూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సోమనాథపురం గ్రామపంచాయతీ పరిధిలోని చినగానపల్లి గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో సిమెంటు రోడ్డును తవ్వి నీటి పైపులు అమర్చారు. సాధారణంగా సిమెంటు రోడ్డు వేస్తే ఏళ్ల తరబడి మన్నిక వస్తుంది. మరి అటువంటిది సిమెంటు రోడ్డును తవ్వి పైపులు అమర్చిన తర్వాత ఆ గుంతలపై రాళ్లు, మట్టి పరిచి వదిలేశారు. రోజులు, నెలలు గడుస్తున్నా ఇంతవరకు రోడ్డును బాగు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటికోసం తవ్విన రోడ్డును తిరిగి బాగు చేసి రాకపోకలకు సజావుగా వీలు కల్పించాలని కోరుతున్నారు.


రోడ్డుమధ్య మట్టికప్పి వదిలేసిన వైనం

విద్యార్థులకు ఆర్టీసీ ఆసరా

పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత, రాయితీ పాసులు



ధర్మవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలు తెరుచుకున్నాయి. పట్టణాల్లోని విద్యాసంస్థలకు వెళ్లేందుకు గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రయాణ ఖర్చు భారంగా మారుతోంది. అటువంటి విద్యార్థులకు ఏపీఎస్ఆర్టీసీ అందిస్తున్న రాయితీ పాసులు వరంగా మారాయి. 10వ తరగతిలోపు చదువుతున్న విద్యార్థినులు, 12 సంవత్సరాలలోపు విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇంటర్, ఆపై చదువుకుంటున్న విద్యార్థులకు రాయితీ పాసులు ఇస్తున్నారు. ఆర్టీసీలో రాయితీ పాసులు పొంది ప్రయాణిస్తున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా నగదు చెల్లిస్తుంది.

దరఖాస్తు ఇలా..

ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత, రాయితీతో ప్రయాణించాలంటే విద్యార్థులు ముందుగా పాస్‌లు పొందాలి. ఆయా బస్టాండ్లలోని బస్సు పాస్ కౌంటర్లలో వాటిని జారీ చేస్తారు. ఉచిత పాస్‌లు పొందాలనుకునే వారు ఆధార్‌కార్డు, పాఠశాలలో హెచ్‌ఎం ఇచ్చే స్టడీ సర్టిఫికెట్‌తో కౌంటర్ వద్దకెళ్లాలి. రాయితీ పాస్‌లకు ఇంటర్ విద్యార్థులు ఆధార్‌కార్డు, పదో తరగతి హాల్ టికెట్, దరఖాస్తుతోపాటు జతచేయాలి. ఆపై తరగతులు చదివేవారు ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపాళ్ల సర్టిఫికెట్లు అందజేయాలి. వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 5 కిలోమీటర్ల పరిధి నుంచి 50 కిలోమీటర్ల వరకు రాయితీ పాస్‌లను ఆర్టీసీ అందిస్తోంది. గతంలో నెలకోసారి విద్యార్థులు పాస్‌లను రెన్యూవల్ చేసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు నెలకు, మూడునెలల వరకు కూడా పొందవచ్చు.

రాయితీ పాసుల రుసుము వివరాలిలా..

దూరం (కి.మీ)	నెలకు (రూ.లలో)	3 నెలలకు (రూ.లలో)
0-5	140	400
5-10	190	555
10-15	240	705
15-20	315	930
20-25	400	1,185
25-30	435	1,290
30-35	475	1,410
35-40	565	1,680
40-45	645	1,920
45-50	735	2,190

సత్యసాయి ప్రేమతత్వంతో వైద్యసేవలు

వైట్ ఫీల్డ్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సుందరేశ్



హెల్త్‌కేర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్టుసభ్యులు

పుట్టపర్తి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సత్యసాయి ప్రేమతత్వంతో కూడిన వైద్యసేవలు అందిస్తున్నామని వైట్‌ఫీల్డ్‌లోని శ్రీసత్యసాయి సూపర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సుందరేశ్ పేర్కొన్నారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో శనివారం శ్రీసత్యసాయి హెల్త్ కేర్ గ్లోబల్ కౌన్సిల్ నిర్వహించారు. వైట్‌ఫీల్డ్ ఆస్పత్రి డైరెక్టర్ మాట్లాడుతూ... సత్యసాయి ప్రేమతత్వంతో పేద, ధనిక, కులమత బేధాలు లేకుండా అందరికీ ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. అనంతరం సత్యసాయి హెల్త్‌కేర్ పుస్తకాన్ని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్.. సభ్యులు నాగానందం, డాక్టర్ మోహన్‌తో కలిసి ఆవిష్కరించారు. వైద్యసేవలను మరింత విస్తరించేందుకు చికాగో, టోక్యో హెల్త్ యూనివర్సిటీలతో ఎంఓయూలు చేసుకున్నట్లు ప్రకటించారు. అనంతరం వైద్యబృందం గానకచేరి నిర్వహించింది. సదస్సులో ప్రశాంతిగ్రామం, వైట్‌ఫీల్డ్ ఆస్పత్రి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆషాఢానికి చిక్కిన పట్టు



ధర్మవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆషాఢం నేతన్న ను ఉక్కిరిబిక్కిరి చేస్తోం ది. ఈనెలలో శుభముహూర్తాలు లేకపోవడంతో నేసిన చీరలు అమ్ముడుపోక ఇబ్బందిపడుతున్నారు. శుభ ముహూర్తాల సీజన్ వస్తే చాలు ధర్మవరంలో ప్రతినెలా రూ.15 కోట్ల నుంచి రూ.20కోట్ల లావాదేవీలు జరుగుతుంటాయి. ప్రస్తుతం అన్‌సీజన్ కావడంతో రూ.5కోట్ల నుంచి రూ.10కోట్లలోపు కూడా క్రయ విక్రయాలు జరిగే పరిస్థితి లేదని చేనేత కార్మికులు, మాస్టర్‌వీవర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షోభంలో పరిశ్రమ

చేనేత పరిశ్రమలో నేతన్నల సంఖ్య తగ్గిపోవడం, గతంతో పోలిస్తే ఉత్పత్తి భారీగా పడిపోవడంతో నేతన్న చీరలకు డిమాండ్ పెరిగింది. 15 సంవత్సరాల కిందట చేనేత పరిశ్రమలో మంచి గిట్టుబాటు ఉండటం వల్ల అన్ని కులాలు, మతాల వారు ఈ చేనేత వృత్తిలోకి వచ్చారు. అప్పట్లో ముడిసరుకుల ధరలు కూడా నిలకడగా ఉండటం. పవర్‌లూమ్స్ చీరలు నామమాత్రంగానే ఉండటం వల్ల ప్రతి చేనేత కార్మికుడికి మంచి ఉపాధి దొరికేది. రానురాను ముడి సరుకుల ధరలు పెరగడం, అందుకు అనుగుణంగా చీరధర పెరగకపోవడంతో పట్టు పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. గతంలో జిల్లా వ్యాప్తంగా 75వేల మగ్గాలుండగా, ప్రస్తుతం 25 వేలలోపే ఉన్నాయంటే చేనేత పరిశ్రమ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ధర్మవరంలో దాదాపు 12వేల మగ్గాలు నడుస్తున్నారు. వారు కూడా పరిశ్రమపై దృష్టి సారించలేకపోవడం, పిల్లలను చదువుల వైపు పంపడం, ఇతర వృత్తులు నేర్పించడం వల్ల మగ్గాల సంఖ్య ఇంకా తగ్గే అవకాశం ఉంది.

భారీగా ఎగుమతులు

ధర్మవరంలో నేతన్న నేసిన చీరలు ఇతర రాష్ట్రాలకు భారీగా ఎగుమతి చేస్తుంటారు. ప్రధానంగా కర్ణాటక, ముంబై, కొయంబత్తూరు, కోల్‌కతా, బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్, చెన్నై తదితర నగరాలకు భారీగా ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం ఆషాఢం నెల ప్రారంభమడం, శుభదినాలు లేకపోవడంతో మరో నెలన్నర రోజుల వరకు అన్‌సీజన్ కొనసాగనుంది. అందుకే బడా వ్యాపారులు చేనేతల నుంచి తయారు చేసిన చీరలను తెప్పించుకుని, సీజన్ రాగానే వాటిని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఉనికి కోసమే వైసీపీ వెంపర్లాట

● ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు

అనంతపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న నేపథ్యంలో... ప్రజల్లో ఉనికి కోల్పోతామేమోనన్న భయంతో వైసీపీ నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారని ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ఎద్దేవా చేశారు. వైసీపీ నేతల విమర్శలపై టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డితో కలిసి శనివారం ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రజలు చక్కగా పాలన చేయమని అధికారమిస్తే.. ఐదేళ్లు దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా వైసీపీ నాయకులు పనిచేశారని విమర్శించారు. ఆ అవినీతి కేసుల్లో ఒక్కొక్కరుగా వైసీపీ నాయకులు జైళ్లకు వెళ్తున్న పరిస్థితుల్లో ప్రజల్లో చులకన అవుతామేమోనన్న భయం ఆ పార్టీ నాయకులకు పట్టుకుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. తమ మా నాయకుడు లోకేశ్ రెడ్‌బుక్ ప్రస్తావన లేకుండా రోజు గడవని పరిస్థితుల్లో వైసీపీ నాయకులు ఉన్నారని ఎద్దేవా చేశారు. ఎవరి ప్రభుత్వ హయాంలో రక్షణలేకుండా పోయిందో ప్రజలకు తెలిసే వైసీపీకి ప్రతిపక్ష హోదాకూడా ఇవ్వలేదన్నారు. ఈ విషయాన్ని వైసీపీ నాయకులు గుర్తుపెట్టుకుని మాట్లాడితే మంచిదని ఆయన హితవు పలికారు.

పెద్దపప్పూరు ఘటనపై ఎస్పీ విచారణ

అనంతపురం క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దపప్పూరు ఘటనపై విచారణ చేయిస్తున్నట్లు జిల్లా ఎస్పీ జగదీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపప్పూరు యువకుడు వంశీని పోలీసులు కొట్టినట్లు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న ఘటనపై విచారణకు ఆదేశించిన ట్లు పేర్కొన్నారు. విచారణాధికారిగా తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఆ ఘటనపై సమగ్రం గా విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. విచారణ నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

చదువులకు చేయూత

ద్వాక్రా మహిళల పిల్లలకు ప్రయోజనం

'ఎన్టీఆర్ విద్యాసంకల్పం' అమలుకు శ్రీకారం

త్వరలో ప్రారంభించనున్న సీఎం



మహిళా సంఘాల సభ్యులు

అనంతపురం అర్బన్/ఉరవకొండ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ద్వాక్రా మహిళల పిల్లల చదువులకు భరోసానిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తపథకానికి రూపకల్పన చేసింది. ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకంలో భాగంగా శ్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ ద్వారా రుణం మంజూరు చేయాలని నిర్ణయించింది. అందుకు సంబంధిచిన విధివిధానాలను ఇప్పటికే సిద్ధం చేసింది. ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న పథకం ద్వారా ద్వాక్రా మహిళల పిల్లల చదువులకు చేదోడు లభించనుంది. విద్యావికాసానికి దోహదపడేందుకు 35 పైసల వడ్డీతో శ్రీనిధి రుణాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకానికి ఎన్టీఆర్ విద్యా సంకల్పంగా నామకరణం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం ద్వారా ప్రతి ఏడాది రూ.200కోట్లు ఖర్చు చేసే విధంగా విధివిధానాలను రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 31 మండల సమాఖ్యలు, 35,561 స్వయం సహాయక సంఘాలు, 1330 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. వీటిలో 3,55,550 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఏడాది ఈ పథకం ద్వారా రూ.20 కోట్ల రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. తద్వారా జిల్లాలోని రెండు వేల మంది కిపైగా ద్వాక్రా మహిళల పిల్లలకు లబ్ధిచేకూరనుంది.

పథకం వర్తించేదిలా..

ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకం ద్వారా ద్వాక్రా మహిళల పిల్లల చదువుల కోసం 35 పైసలు వడ్డీతో రెండు నుంచి మూడు సంవత్సరాల కాల వ్యవధిలో తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు, ఇతర రకాల కోర్సులు చదివే ద్వాక్రా మహిళల పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కళాశాలల్లో చదివే విద్యార్థులైనా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. ఈ రుణాలను పూర్తిగా పిల్లల చదువుల కోసం వినియోగించాల్సి ఉంటుంది. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, సాంకేతిక విద్యాసామాగ్రి, విద్యార్థులకు కావాల్సిన ఇతర సామాగ్రిని కొనుగోలుకు రుణాన్ని ఖర్చు చేయాలన్న నిబంధన విధించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు సైకిళ్లను కూడా కొనుగోలు చేసుకోవచ్చు. పిల్లల చదువుల కోసం ఖర్చుపెట్టిన వివరాలకు సంబంధించి తగిన రసీదులను శ్రీనిధి అధికారులకు అందించాల్సి ఉంటుంది. ద్వాక్రా సంఘాల్లోని సభ్యులందరూ పథకానికి అర్హులు. వారి పిల్లల అవసరానికి అనుగుణంగా రూ.10వేల నుంచి రూ. లక్ష వరకూ శ్రీ నిధి ద్వారా రుణాలు అందించాలని నిర్ణయించారు.



పేద కుటుంబాలకు ఊరట



శ్రీనిధి పథకం ద్వారా పిల్లల చదువుకు రూ.లక్ష దాకా రుణం పొందే అవకాశం కల్పించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించడం సంతోషంగా ఉంది. పిల్లల చదువు కోసం ఈ కొత్త పథకం ఉపయోగపడుతుంది. ఇద్దరు పిల్లలను ప్రైవేట్ స్కూల్లో చదివిస్తున్నాం. బయట వడ్డీలకు తెచ్చి పిల్లలను చదివించుకునే మాలాంటి వారికి ఈ పథకం ఎంతగానో ఉపయోగం. 35 పైసల వడ్డీకే రూ.లక్ష వరకు రుణం ఇవ్వాలని సీఎం నిర్ణయం తీసుకోవడంతో పేద కుటుంబాలకు ఊరట లభిస్తుంది.

-మంజుల, డ్వాక్రా సభ్యురాలు, రాచేపల్లి, ఉరవకొండ మండలం

సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం



ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకం ద్వారా పిల్లల చదువులకు రుణాలిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బాగుంది. ఇప్పటికే తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లలు ఉన్నా ఇస్తున్నారు. పేద కుటుంబాల్లోని పిల్లల చదువుల కోసం తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పిస్తున్న సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం. పేద కుటుంబాలకు ఈ పథకం భరోసా కల్పిస్తుంది.

-సునీత, మోపిడి, ఉరవకొండ మండలం

పేద విద్యార్థులకు ఉపయోగం



రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యకు చేయూతనిచ్చేందుకు ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకానికి శ్రీకారం చుట్టింది. గతంలో శ్రీనిధి ద్వారా డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణాలు ఇచ్చేవారు. ఈసారి ఆ తరహా రుణాలతోపాటు, డ్వాక్రా మహిళల పిల్లల చదువు కోసం ప్రత్యేకంగా రుణ సదుపాయం కల్పించాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. అవసరానికి అనుగుణంగా రూ.10వేల నుంచి రూ. లక్ష వరకూ శ్రీ నిధి ద్వారా రుణాలు అందించాలని నిర్ణయించారు. కేవలం 35పైసల వడ్డీతో 2 నుంచి 3 సంవత్సరాల కాల వ్యవధిలో తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు, ఇతర రకాల కోర్సులు చదివే డ్వాక్రా మహిళల పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తాం.

-శైలజ, పీడీ, డీఆర్‌డీఏ

బదిలీల్లో గందరగోళం..!

తొలుత సీనియార్టీ జాబితా మేరకు...

మధ్యాహ్నం నుంచి ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్

గ్రామ వ్యవసాయ సహాయకుల బదిలీల్లో సిఫార్సులు

లేఖలు జతచేయని వారికి అన్యాయం

అనంతపురం అర్బన్, జూన్28(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ గందరగోళ ంగా మారింది. అనంతపురం వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అగ్రికల్చర్ అసిస్టెంట్‌ల బదిలీల కౌన్సెలింగ్ శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. తొలుత స్పౌజ్, వికలాంగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ తర్వాత మిగతా సిబ్బందికి కౌన్సెలింగ్ ప్రక్రియలో సీనియార్టీ జాబితా మేరకు చాంబర్‌లోకి పిలిచారు. సీనియార్టీ మేరకు కౌన్సెలింగ్ నిర్వహించడంపై సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గంటపాటు కౌన్సెలింగ్ నిలిచిపోయింది. తిరిగి మధ్యా హ్నం నుంచి ర్యాంకుల వారిగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంత జిల్లాలో 126 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 124 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. వీరిలో అనంత జిల్లాలో 101 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 102 మంది సిబ్బందికి ఐదేళ్ల కాలం పూర్తయింది. మిగిలిన సిబ్బంది రిక్వెస్ట్ కింద బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో జేడీ కార్యాలయం సిబ్బందితో కిక్కిరిసింది. రాత్రి 9.40 దాకా బదిలీల కౌన్సెలింగ్ కొనసాగింది.

సిఫార్సులకు పెద్దపీట

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల్లో ప్రజాప్రతినిధుల సిఫార్సులకే పెద్ద పీట వేశారు. సిఫార్సు లేఖలు జత చేయని సిబ్బందికి అన్యాయం జరిగింది. మండల, డివిజన్ స్థాయి అధికారులు తమకు అనుకూలమైన స్థానం కోసం ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు పెట్టడం సాధారణం. అందుకు విరుద్ధంగా రైతు సేవా కేంద్రంలో పనిచేసే సిబ్బంది బదిలీల కోసం ప్రజాప్రతినిధుల సిఫార్సులేఖలు ఇవ్వడం గమనార్హం.

నేడు కౌన్సెలింగ్‌కు రండి

- ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి

అనంతపురం అర్బన్(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా ఉద్యాన సహాయకులకు ఆదివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహి స్తున్నట్లు ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనంతపురం ఉద్యాన డీడీ కార్యాల యంలో ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లు పూర్తయిన 280 మందితోపాటు రిక్వెస్ట్ బదిలీ కోసం 43 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే సిబ్బంది ఆప్షన్ ఫాంతోపాటు తగిన పత్రాలు తీసుకురావాలన్నారు. మెరిట్ సీనియార్టీ మేరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆవె వెల్లడించారు.

జాకీ పోయె.. రేమండ్ వచ్చె..!



● రాప్తాడు వద్ద కంపెనీ ఏర్పాటుకు ముందుకొచ్చిన సంస్థ ● 3 వేల మందికి ఉపాధి

● రాప్తాడును పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక పాలనలో తెలంగాణకు తరలిపోయిన జాకీ పరిశ్రమ స్థానంలో.. రేమండ్ సంస్థ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. రాప్తాడు నియోజకవర్గ అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి.. జాకీ ప్రతినిధులను కాసులకోసం బెదిరించిన నేపథ్యంలోనే.. ఆ సంస్థ తెలంగాణకు తరలిపోయిందన్న ఆరోపణలు వినిపించాయి. అధికార మార్పిడి నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడం, రాప్తాడు నియోజకవర్గం నుంచి పరిటాల సునీత విజయం సాధించిన విషయం తెలిసిందే. పరిటాల సునీత ఎన్నికల ప్రచారంలో భాగంగా... జాకీ పరిశ్రమ స్థానంలో మరొకటి తీసుకొచ్చి వేలాదిమందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. దానిని నిలబెట్టుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో జాకీ పరిశ్రమ స్థానంలో రేమండ్ సంస్థ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం శుభపరిణామం. రూ.330 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. తద్వారా దాదాపు 3వేల మందికి ఉపాధి లభించనుంది. దీంతో రాప్తాడు నియోజకవర్గ పారిశ్రామిక అభివృద్ధికి అడుగులు పడినట్లయిందనడంలో సందేహం లేదు.

26.87 ఎకరాల్లో...

రాప్తాడు వద్ద 26.87 ఎకరాల్లో రేమండ్ సంస్థ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఎకరా రూ.20 లక్షల చొప్పున కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు కోసం స్థిర మూలధన పెట్టుబడి కింద రూ.330 కోట్లను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు దానిపై ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ పరిశ్రమ ఏర్పాటుద్వారా ప్రత్యక్షంగా 3వేల మందికి, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభించనుంది. ఇటీవల దాదాలూరు వద్ద ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించారు. ఆ ప్రాంతానికి మరికొన్ని కంపెనీలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

మాట నిలబెట్టుకున్నాం

ఎన్నికల హామీ మేరకు జాకీ స్థానంలో ప్రఖ్యాత గార్మెంట్ పరిశ్రమ రేమండ్‌ను తీసుకొచ్చాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో రాప్తాడు సమీపంలో జాకీ పరిశ్రమ ఏర్పాటుకు ఆ సంస్థ ముందుకొచ్చింది. పనులు ప్రారంభించారు. తర్వాత ఎన్నికలు రావడం.. వైసీపీ ప్రభుత్వంలోకి రావడం జరిగిపోయాయి. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అతని సోదరులు జాకీ సంస్థను బెదిరించడంతో.. తెలంగాణకు వెళ్లిపోయింది. మరో గార్మెంట్ సంస్థను తీసుకొస్తామంటూ ఐదేళ్లు తోపు కుటుంబం కాలం గడిపింది. జాకీ పరిశ్రమను తిరిగి రప్పించడంగానీ, అదే స్థానంలో మరొకటి తీసుకొస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. దానిని నిలబెట్టుకున్నాం. చెన్నే కొత్తపల్లి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు 4వేల ఎకరాలు అనువైన భూమి ఉంది. అక్కడి రైతులను ఒప్పించి మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఓవైపు హంద్రీనీవా ద్వారా నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తూనే.. మరోవైపు పారిశ్రామికీకరణ దిశగా అడుగులు వేస్తున్నాం.

- ఎమ్మెల్యే పరిటాల సునీత

ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్

అనంతపురం రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలిసెట్-2025 కౌన్సెలింగ్ ముగిసింది. అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు, కళ్యాణదుర్గం, తాడిపత్రి, హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియ సాగింది. చివరి రోజు శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 336మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఈనెల 21 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. చివరి రోజు వరకు 2712మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌లో తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఎవరైనా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోకపోతే వారు ఆప్షన్ ఎంట్రీ తేదీల్లో హెల్ప్ లైన్ సెంటర్‌ను సంప్రదించవచ్చునన్నారు. ఆప్షన్ల ప్రక్రియ తేదీ త్వరలోనే వెలువడుతుందన్నారు.

బతుకుపై భరోసా..

కుట్టు శిక్షణకు విశేష స్పందన

మహిళల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం

ఒక యేడు అతివృష్టి, మరో యేడు అనావృష్టి.. పంటలు వేసిందే తప్ప.. చేతికొచ్చింది లేదు. లాభాలు చూసిందీ లేదు. నష్టాలే రాబడి.. అప్పులే మిగులుబడి.. ఇల్లు గడవాలన్నా కష్టమే.. పిల్లల చదువులు, పెళ్లిళ్లు తలచుకుంటే భయమేసేది.. బతుకే బెంగ.. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఇస్తున్న కుట్టు శిక్షణకు మహిళలు ఆసక్తి చూపారు.. ఇలాగైనా బతికే మార్గం దొరుకుతుందేమోననుకున్నారు.. శిక్షణ పూర్తి దశకు చేరుకున్నాక.. వారికి ఎనలేని ధైర్యం వచ్చింది. కుట్టు మిషన్‌తో బతికేయగలమన్న నమ్మకం పెరిగింది.. కుట్టుశిక్షణ బతుకుపై భయాన్ని పోగొట్టి.. ఆత్మవిశ్వాసం నింపిందని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..

పెనుకొండ టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇస్తున్న కుట్టు శిక్షణ వారిలో బతుకుపై భరోసా కల్పిస్తోంది. మహిళలకు సమాజంలో సరైన అవకాశం లేకపోవడం, చదువుకున్నా ఉద్యోగం లేకపోవడం, కుటుంబ బాధ్యతలు వంటి కారణాలతో ఇంటికే పరిమితం అవుతున్నారు. అటువంటి వారికి ఉపాధి కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు కుట్టుశిక్షణ ఇస్తోంది. పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌తోపాటు కుట్టుమిషన్ ఉచితంగా అందజేయనుంది. కుట్టుశిక్షణకు మహిళల నుంచి మంచి స్పందన వస్తోంది. శిక్షణ పూర్తి చేసుకుని ఇంటి వద్దే జీవనోపాధి పొందుతామని మహిళలు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 18 వేల మందికి..

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 18 వేల మంది మహిళలు ఉచితంగా కుట్టుశిక్షణ పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాల్లో 80 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నారు. 90 రోజుల ఈ శిక్షణ ముగింపు దశకు చేరుకుంది. దీంతో మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. గ్రామంలో కుట్టుమిషన్ ఏర్పాటు చేసుకుని, ఉపాధి పొందగలమంటున్నారు. తద్వారా కుటుంబ ఖర్చులు భరించగలమని సంతోష పడుతున్నారు.

ధైర్యం వచ్చింది..



ఉచిత కుట్టు శిక్షణతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. చాలీచాలని ఆదాయంతో ఇబ్బందులు ఉంటాయి. కూటమి ప్రభుత్వం కుట్టు మిషన్‌పై శిక్షణ ఇవ్వడంతోపాటు ఉచితంగా కుట్టుమిషన్లు అందించడం సంతోషంగా ఉంది. శిక్షణతో సొంతకాళ్లపై నిలబడగలమన్న ధైర్యం వచ్చింది.

- నాజియా, దర్గాపేట, పెనుకొండ





కుట్టుమిషన్‌పై మంత్రి సవిత (ఫైల్), పెనుకొండలో శిక్షణ పొందుతున్న మహిళలు

ఇంటి బాధ్యతలో నా వంతుగా..



ఇంటి ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఇవి భారమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కుట్టు శిక్షణ పూర్తి చేసుకోవడం ఎంతో ఉపశమనం. గ్రామంలో టైలరింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకుంటా. తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఇంటి ఖర్చులు, అభివృద్ధికి వినియోగిస్తా.

- అరుణ, వెంకటరెడ్డిపల్లి, పెనుకొండ మండలం

విశేష స్పందన



కూటమి ప్రభుత్వంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు నాయుడు ఈ ఏడాది మార్చిలో ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 15న శిక్షణ కేంద్రాలను ప్రారంభించాం. పెద్దఎత్తున మహిళలు వచ్చారు. జూలై మొదటి వారానికి శిక్షణ పూర్తవుతుంది. పూర్తి చేసుకున్న ప్రతి మహిళకు ఉచిత కుట్టుమిషన్‌తోపాటు సర్టిఫికెట్ అందిస్తాం. కుట్టుశిక్షణతోనే ఆగిపోకుండా కంప్యూటర్ డిజైన్ తదితర వాటిపై నైపుణ్యం సాధించి, మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి. వాటన్నింటికీ ప్రభుత్వం అండగా ఉండి రుణాలు అందిస్తుంది.

- సవిత, బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

అశుతోష్ ముఖర్జీ (జయంతి)



'టైగర్ ఆఫ్ బెంగాల్' పేరొందిన శాస్త్రవేత్త అశుతోష్ ముఖర్జీ 1864 జూన్ 29న జన్మించారు. గణితం, సైన్స్, న్యాయశాస్త్రంలలో నిష్ణాతుడు. సాహితీవేత్త, సంఘ సంస్కర్త, తత్వవేత్త కూడా. గణితంలో ప్రతిభావంతుడైనప్పటికీ కోల్కత్తా విశ్వ విద్యాలయంలో తగినన్ని నిధులు లేకపోవడంతో ఆయన్ను ఆచార్యుడిగా నియమించలేకపోయారు. 1888లో న్యాయవాద వృత్తి చేపట్టి 1904లో కోల్కత్తాలో హైకోర్టు న్యాయమూర్తి అయ్యారు. అనంతరం 1906 నుంచి 1914వరకు కోల్కత్తా విశ్వవిద్యాలయానికి వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. ఆయన నేతృత్వంలో ఇతర యూనివర్సిటీలకు మాదిరిగా తీర్చిదిద్దబడింది. నైట్ బ్యాచ్‌లర్, కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఇండియా (సీఎస్‌ఐ) తదితర పురస్కారాలు అందుకున్నారు. 1924 మే 25న కన్నుమూశారు. కాగా శతజయంతికి ఆయన జ్ఞాపకార్థం ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదలైంది.

కమలాకర కామేశ్వరరావు (వర్ధంతి)



పౌరాణిక చిత్రాల బ్రహ్మగా పేరొందిన కమలాకర కామేశ్వరరావు 1911 అక్టోబరు 4న కృష్ణా జిల్లా మచిలీపట్నం (బందరు)లో జన్మించారు. సాంఘిక చిత్రాల మాటెలా ఉన్నా పౌరాణిక చిత్రాలలో తెలుగు పౌరాణికాలకు సాటి రాగలవి దేశంలో మరేభాషలోనూ లేవనడంలో అతిశయోక్తి లేదు. ఈ కోవలో పాండురంగ మహత్యం, గుణసుందరి కథ, నర్తనశాల, పాండవ వనవాసం, శ్రీకృష్ణ తులాభారం తదితర సినిమాలకు దర్శకత్వం వహించారు. తొలుత సినిమాలకు రివ్యూలు రాసేవారు. విమర్శలు సైతం ప్రామాణికంగా ఉండేవి. 1998 జూన్ 29న కన్నుమూశారు.

సూదిగుచ్చేయ్..!

- యాడికిలో స్థాయికి మించి ఆర్‌ఎంపీ వైద్యం
- మోకాళ్ల నొప్పులకు స్టెరాయిడ్స్ ఇస్తున్న వైనం
- ప్రజల ప్రాణాలతో చెలగాటం



యాడికి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ ఆర్‌ఎంపీ స్థాయికి మించిన వైద్యం చేస్తున్నాడు. ఏకంగా స్టెరాయిడ్స్ ఇస్తున్నాడు. మోకాళ్ల నొప్పులు తగ్గిస్తానంటూ స్టెరాయిడ్ ఇంజక్షన్ వేస్తున్నాడు. డబ్బు కోసం జనం ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాడు. ఒక ప్రథమ చికిత్స కేంద్రం నిర్వాహకుడు మూడు నెలలుగా ఈ తతంగం సాగిస్తున్నాడు. ఆ ఆర్‌ఎంపీ వ్యవహారంపై కొందరు ఫొటోలు తీసి, జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. యాడికి ప్రభుత్వ వైద్యాధికారి పరమేశ్వర్ ప్రథమ చికిత్స కేంద్రం తనిఖీకి వెళ్లారు. రోగులకు ఆర్‌ఎంపీ ఇస్తున్న మందులను పరిశీలించారు. 'వైద్యనిపుణులు ఇవ్వాల్సిన మందులను ఎలా ఇస్తావ'ంటూ ఆర్‌ఎంపీని ప్రశ్నించినట్లు సమాచారం. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని హెచ్చరించి వచ్చినట్లు తెలిసింది. ప్రథమ చికిత్స కేంద్రంలో మోకాళ్ల నొప్పుల నివారణకు స్టెరాయిడ్స్ ఇస్తున్నారని చర్చించుకుంటున్నారు. తద్వారా నొప్పులకు తాత్కాలిక ఉపశమనం లభిస్తుందనీ, స్టెరాయిడ్స్ ప్రభావం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

రూ.400 నుంచి రూ.500 వసూలు

యాడికిలోని ప్రథమ చికిత్స కేంద్రంలో ఆర్‌ఎంపీ ఇస్తున్న స్టెరాయిడ్ ఇంజక్షన్‌తో మోకాళ్ల నొప్పులకు తాత్కాలిక ఉపశమనం లభిస్తుండడంతో రోగులు ఇతడి వద్దకు ఎక్కువగా వస్తున్నారు. యాడికితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి మోకాళ్ల నొప్పుల నివారణ కోసం వృద్ధులు ఎక్కువగా వస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న సదరు ఆర్‌ఎంపీ ఒక్కో ఇంజక్షన్‌కు రూ.400 నుంచి రూ.500 వసూలు చేస్తున్నాడు. కేవలం ప్రథమ చికిత్స అందించాల్సిన ఆర్‌ఎంపీ తన వద్దకు వచ్చే రోగులకు స్టెరాయిడ్స్ ఇస్తుండడం గమనార్హం. వీటి వల్ల వైద్యం వికటించి రోగులకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్థాయికి మించి వైద్యసేవలు అందిస్తూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాల నిర్వాహకులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైద్యం వికటిస్తున్నా..

గతంలో మండలంలో ఆర్‌ఎంపీల వైద్యం వికటించి రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యాడికిలో ఆర్‌ఎంపీ ఇచ్చిన చికిత్సతో ఓ మహిళ తీవ్ర అనారోగ్యం పాలైంది. సదరు మహిళ బంధువులు ఆ ప్రథమ చికిత్స కేంద్రం వద్ద ధర్నాకు దిగారు. ఆమె వైద్యచికిత్సల ఖర్చు భరిస్తానంటూ ఆర్‌ఎంపీ వారితో రాజీ కుదుర్చుకున్నాడు. రాయలచెరువులో ఒక ఆర్‌ఎంపీ ఇచ్చిన వైద్యం వికటించింది. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా స్థాయికి మించి వైద్యం అందిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆర్‌ఎంపీలపై వైద్యశాఖ అధికారులు ఎందుకు చర్యలు చేపట్టలేకపోతున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఉన్నతవిద్య పరిశోధనలవైపు వెళ్లండి

» విద్యార్థులకు పద్మశ్రీ ప్రశాంత్ ప్రకాశ్ సూచన

బెంగళూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ పూర్తి చేస్తూనే ఉద్యోగాల వేట కాకుండా ఉన్నత విద్య, పరిశోధనలవైపు దృష్టి సారించాలని యాక్సెల్ ఇండియా ఫౌండర్, అన్‌బాక్సింగ్ బీఎల్‌ఆర్ ఫౌండేషన్ కోఫౌండర్ పద్మశ్రీ ప్రశాంత్ ప్రకాశ్ విద్యార్థులకు సూచించారు. సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల 22వ స్నాతకోత్సవం శనివారం జరిగింది. 1200మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ గ్రహీత ప్రశాంత్‌ప్రకాశ్ మాట్లాడుతూ సీఎంఆర్ సంస్థ రజతమహోత్సవం జరుపుకోవడం సంతోషించే విషయమన్నారు. చదువుకు, నైపుణ్యత, తెలుసుకునేందుకు అంతం లేదని జీవితకాలం కొత్త అంశాలపై అవగాహన పొందాలన్నారు. ఇక్కడి పూర్వ విద్యార్థులు స్టార్టప్‌లు ప్రారంభించడం సంతోషకరమన్నారు. సీఎంఆర్ చైర్మన్



స్నాతకోత్సవంలో సీఎంఆర్ చైర్మన్ డాక్టర్ కేసీ రామమూర్తి, పద్మశ్రీ ప్రశాంత్ ప్రకాశ్ తదితరులు

డాక్టర్ కేసీ రామమూర్తితోపాటు డాక్టర్ త్రిస్తా రామమూర్తి, సీఎంఆర్ జ్ఞానధార ట్రస్టు కార్యదర్శి జగన్నాథరెడ్డి, ప్రో-చాన్స్‌లర్ జైదీప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సంజయ్‌జైన్, డీన్ డాక్టర్ చిత్రాలు ఉన్నారు.

విద్యుత్ కనెక్షన్‌ల చట్టాలను పునఃపరిశీలించండి



నిరసన తెలుపుతున్న విద్యుత్ కాంట్రాక్టర్ అసోసియేషన్ నాయకులు

దొమ్మసంద్ర, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్‌లకు సంబంధించి ఇటీవల జారీచేసిన చట్టాలను పునఃపరిశీలించాలని విద్యుత్ కాంట్రాక్టర్‌ల అసోసియేషన్, ఆనేకల్ తాలూకా రిజిస్టర్డ్ సమితి భారీ నిరసన చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు శివానందరెడ్డి నేతృత్వంలో చందాపుర సర్కిల్‌లో నుంచి కేఈబీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం, సుప్రీంకోర్టు వెలువరించిన విద్యుత్ చట్టాలను పునఃపరిశీలించి ఈ రంగంపై ఆధారపడినవారికి న్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శివానందరెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 24కు ముందు భవనాలకు తాత్కాలిక కనెక్షన్ ఇచ్చి అనంతరం శాశ్వత కనెక్షన్‌కోసం నిర్ణీత డిపాజిట్‌లు వసూలు చేసేవారన్నారు. భవనాలకోసం గ్రామపంచాయతీలు ఇచ్చే మాన్యువల్ బ్లూ ప్రింట్ ఆధారంగా వాటికి విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చేవారన్నారు. అయితే ఇటీవల భవనాలకు సంబంధించి సీసీ, ఓసీలు పొందడం అనేది రాష్ట్రప్రభుత్వ నిర్ణయమని సుప్రీంకోర్టు సూచించడంతో వీటిని తప్పనిసరి చేశారన్నారు. దీంతో నూతనంగా భవనాలు చేపట్టేవారికి విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయడం కష్టంగా మారిందన్నారు. విద్యుత్ కనెక్షన్ అనేది మౌలిక సదుపాయాలలో ఒకటని, దీనికి ఏదో ఒక ఆంక్షలు విధించి ఇబ్బంది కలిగించడం సరికాదన్నారు. ఆంక్షలను సడలించాలని డిమాండ్ చేశారు.

నేడు కేఎంహెచ్ జీవనగాథ పుస్తకావిష్కరణ



మీడియాతో కేఎం హనుమంతరాయ, హలికల్ నటరాజ్ తదితరులు

దొడ్డబళ్లాపుర, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఎంహెచ్ భవనంలో కేఎంహెచ్ అభిమానుల సేవా సమితి ఆధ్వర్యంలో 'వనసుమ దొఒన్న మన కుణియనలిదాడుతిరె' అనే పుస్తకాన్ని ఆవిష్కరణ ఉంటుందని రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ డైరెక్టర్ హలికల్ నటరాజ్ అభిప్రాయపడ్డారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రపట్టుమండలి మాజీ అధ్యక్షుడు కేఎం హనుమంతరాయప్ప పుట్టి పెరిగిన విధానం, ఆయన సాధనల గురించి సమగ్ర వివరాలతో పుస్తకాన్ని 29న ఆదివారం ఆవిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఆదిచుంచనగిరి విజయనగర శాఖమఠం సౌమ్యనాథస్వామి, తపసీహళ్ళి సేవాశ్రమ దివ్యాజ్ఞానానందగిరి స్వామి సాన్నిధ్యం వహించనుండగా విద్యా వాచస్పతి డాక్టర్ అరళు మల్లిగె పార్థసారథి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే గంటిగానహళ్ళి వీ కృష్ణప్ప, ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు, ఎస్‌ఆర్ విశ్వనాథ్, ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యులు డీవీ నారాయణశర్మ సహా పలువురు అధ్యక్షత వహిస్తారన్నారు. కేంద్ర పట్టు మండలి మాజీ అధ్యక్షుడు హనుమంతరాయప్ప మాట్లాడుతూ 30ఏళ్లక్రితం దొడ్డబళ్ళాపురకు తాను సామాన్య మగ్గం కూలీగా వచ్చానని, అనంతరం అందరి సహకారంతో ఈ స్థాయికి వచ్చానన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం 8-10 గంటలపాటు శ్రమించి పనిచేస్తే తగినంత సంపాదన చేయ వచ్చు నన్నారు. కాగా పట్టణంలో కొంగాడియప్ప, స్వామి వివేకానంద, మహాత్మాగాంధీ వంటి మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయించానన్నారు. ప్రజా కార్యక్రమాలు చేశానన్నారు. మీడియా సమావేశంలో డీవీ నారాయణ శర్మ, క్లబ్ అధ్యక్షుడు నంజుండస్వామి, డైరెక్టర్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వైద్యశిబిరం



ఉచిత వైద్య శిబిరంలో నిర్వాహకులు

బొమ్మనహళ్ళి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బొమ్మనహళ్ళి పరిధిలోని కూడ్లు గ్రామం ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకుడు బాబురాజ్ నేతృత్వంలో శనివారం నిర్వహించారు. ఎలక్ట్రానిక్ సిటీలోని పీఈఎస్ ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొని పరీక్షలు చేశారు. షుగర్, బీపీ, థైరాయిడ్, కీళ్ళనొప్పులు, హార్ట్ తదితర అన్ని రకాల సమస్యలకు వైద్య పరీక్షలు చేశారు. ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 3వరకు శిబిరం కొనసాగింది. కేసీసీసీ సభ్యుడు బాలకృష్ణారెడ్డి శిబిరాన్ని లాంచనంగా ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం స్థానికులకు కూడా వైద్య పరీక్షలు, చికిత్సలు అందచేశారు. అత్యవసరమైన వారికి పీఈఎస్‌లో రాయితీతో వైద్యం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. శిబిరం ద్వారా 230మందికిపైగా ప్రయోజనం పొందారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు చిక్కమునియప్ప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమిత్ర, పాఠశాల ఎస్‌డీఎంసీ గౌరవాధ్యక్షులు సాకప్ప, అధ్యక్షురాలు అనిత, ఇంజనీర్ లక్ష్మీనారాయణ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అశ్వత్థకట్ట నిర్మాణానికి భూమిపూజ

శిడ్లఘట్ట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురాతనమైన, శిడ్లఘట్ట నగర నిర్మాత శివనేగౌడ స్థాపించిన కోటి శ్రీసోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అశ్వత్థకట్ట (నాగదేవతలు) నిర్మాణానికి నారాయణస్వామి దంపతులు భూమి పూజ చేశారు. వేపచెట్టు, రావిచెట్టు మొక్కలకు ధార్మిక విధి విధానాల ప్రకారం పూజ చేశారు. వేద పురోహితుడు బశెట్టిహళ్ళి కృష్ణమూర్తి పౌరోహిత్యంలో కార్యక్రమాలు కొనసాగాయి. కాగా పురాతన ఆలయంలో అశ్వత్థకట్ట నిర్మాణానికి చర్యలు చేపట్టడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. తాలూకాలోని ఆలయాల జీర్ణోద్ధరణకు పలువురు దాతలు, భక్తులు సహకారం అందిస్తున్నారన్నారు. ఆలయాల జీర్ణోద్ధరణతో సంప్రదాయాలను కాపాడుకున్నవారం అవుతామన్నారు. సోమేశ్వర ఆలయ సమితి అధ్యక్షుడు డాల్ఫిన్ నాగరాజ్ నేతృత్వంలో ఆలయ ధర్మకర్త మురళి, రూపసి రమేశ్, డిష్ శ్రీనాథ్, సీనియర్‌లు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ప్రముఖులు

ప్రతిభా పురస్కారాల ప్రదానం



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు

ముళబాగిలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుని ప్రయోజకులు కావాలని విద్యార్థులకు రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు, రాష్ట్ర పురస్కార గ్రహీత ఎంఆర్ కృష్ణమూర్తి అభిప్రాయ పడ్డారు. తాలూకాలోని యళగొండహళ్ళి ప్రభుత్వ హైస్కూల్ 2024-25 విద్యాసంవత్సరంలో ఎస్ఎస్ఎల్‌సీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం పురస్కారాలు ప్రదానం చేశారు. పాఠశాల పర్యావరణం సహా ఉత్తమ వ్యక్తిత్వం పొందేందుకు సహకారి కానుందన్నారు. విద్యార్థి జీవనం అత్యంత శ్రేష్ఠమైనదన్నారు. దాతలు శ్రీనివాసమూర్తి, దివంగత వెంకటేశ్ అయ్యర్, దొరస్వామి అయ్యర్, శంకర్ నారాయణ, వినయ్ అయ్యర్ తదితరులు ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధిస్తున్న వారికి ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పొందిన విద్యార్థులకు రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు రిటైర్డు టీచర్ గాయత్రి అందచేశారు. మరో ఆరుగురు విద్యార్థులకు రూ.500 నగదు ప్రోత్సాహకం ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు వెంకటేశప్ప, ఉపాధ్యాయులు రుక్మిణి, సుధాకర్, దర్శన్ వెంకటాచల మూర్తి, గోపినాథ తదితరులు పాల్గొన్నారు.

12న జాతీయ లోక్‌అదాలత్

బాగేపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేఎంఎఫ్‌సీ కోర్టులో జులై 12న జాతీయ లోక్ అదాలత్ జరగనుందని సీనియర్ శ్రేణి న్యాయాధికారి భారతి తెలిపారు. పట్టణంలో శనివారం కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్ సన్నాహకసభలో పాల్గొని మాట్లాడారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను, వివిధ రీతులలో ఉన్న కేసులను అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సివిల్ కేసులు, కార్మిక, బ్యాంకు రుణాలు, కుటుంబ కలహాలు, చెక్‌బౌన్స్, మోటారు ప్రమాదాలు తదితర కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. రాజీవల్ల ఎవరికీ అన్యాయం కాదని అభిప్రాయ పడ్డారు. తాలూకా లీగల్ సర్వీసెస్ సెల్ మెంబర్ సెక్రటరీ మంజునాథాచారి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో చేపట్టే తీర్మానమే అంతిమమని, కేసు రాజీ అయ్యాక పైకోర్టుకు



న్యాయాధికారి భారతి తదితరులు

అప్పీల్ చేసే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్, ఉపాధ్యక్షుడు సీ రవి, కార్యదర్శి బిందూ కుమారి, కోశాధికారి ఆర్ జయప్ప, న్యాయవాదులు నాగభూషణ్, బాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యకు ఆదరణ పెరిగింది



రజత మహోత్సవంలో విద్యార్థులు తదితరులు

బెంగళూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దూరవిద్యకు ఆదరణ పెరిగిందని, ఉద్యోగం, వ్యాపారం, ఇతరత్రా వృత్తులలో స్థిరపడినవారు దూరవిద్య ద్వారా కోర్సులు చేయాలనుకోవడంతో ఆదరణ పెరిగిందని సింబియాసిస్ సెంటర్ ఫర్ డిస్టన్స్ లర్నింగ్ (ఎస్‌సీడీఎల్) ముఖ్యులు డాక్టర్ అర్జున్ వైద్య అభిప్రాయపడ్డారు. ఎస్‌సీడీఎల్ రజతమహోత్సవాన్ని శనివారం జరిగింది. ఈ సందర్భంగా అర్జున్‌వైద్య మాట్లాడుతూ వేగవంతంగా మారుతున్న ఉద్యోగ మార్కెట్‌లో తమకు తాముగా ఉన్నతవిద్య పొందడం అవసరమైందన్నారు. సోషల్ మీడియా యుగంలో డిజిటల్ విభాగంలో మీ ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు నైపుణ్యత, విద్యార్హతలు కీలకమే అన్నారు. గ్రామీణభారత్‌లో పరిశ్రమలు ప్రారంభించేందుకు అవకాశాలు ఉన్నాయని, ఈ దిశగా ప్రయత్నించాలన్నారు. దేశంలో అతిపెద్ద దూరవిద్య సంస్థలలో ఎస్‌సీడీఎల్ ఒకటిగా అభివర్ధించారు. డాక్టర్ స్వాతి మజుందార్ మార్గదర్శకంలో కార్య క్రమం జరిగింది. పూర్వవిద్యార్థులు భాగస్వామ్యులయ్యారు. జాతీయ, అంత ర్జాతీయ స్థాయిలో స్థిరపడిన ఉద్యోగులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

బీఎంఎస్‌లో రాష్ట్రస్థాయి యోగా చాంపియన్ పోటీలు



షీల్డులతో విద్యార్థులు, నిర్వాహకులు

బెంగళూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): యలహంకలోని బీఎంఎస్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ క్యాంపస్‌లో మారుతి చారిటబుల్ ట్రస్టు, స్మియా యోగా అకాడమీ సహకారంతో రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. యువత పోటీలలో పాల్గొని యోగా విన్యాసాలు చేశారు. బీఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ శైలా బంటనూరు, మారుతి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ బీకే, విశ్వమానవ సమాజసేవా ట్రస్టు అధ్యక్షులు ఎన్ శివరాజు పాల్గొన్నారు. విశిష్ట యోగా సాధక, యోగా ప్రవీణ పురస్కారాలను శనివారం ప్రదానం చేశారు. ఎన్ జయరాం అభినందనా సమితి సభ్యులు సహకారం అందించారు. విద్యార్థులను ప్రోత్సహించే పలు కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారు.

ప్రధానోపాధ్యాయురాలికి ఆత్మీయ వీడ్కోలు



ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శాంతమ్మకు ఆత్మీయ సత్కారం

బంగారపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తాలూకా సహా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 40ఏళ్లపాటు పిల్లలకు ఉత్తమ విద్య అందించి రిటైరైన హెచ్‌ఎం శాంతమ్మకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. తాలూకాలోని కారహళ్ళి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యా యురాలిగా విధులు నిర్వహించి రిటైరైన ఆమెకు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయగౌడ నేతృత్వంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సహోద్యోగులు, విద్యార్థులు, పాఠశాల ఇన్‌చార్జ్ సమితి, విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులతో సత్సంబంధాలు కలిగి ఉండేవారన్నారు. పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు కల్పించిన ఆమె రిటైరైన జవనం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సన్మానం స్వీకరించిన శాంతమ్మ మాట్లాడుతూ అందరి సహకారంతో విధులు నిర్వహించానన్నారు. 40ఏళ్లపాటు వందలాదిమంది విద్యార్థులకు పాఠాలు బోధించే అవకాశం లభించడం పుణ్యంగా పేర్కొన్నారు. మనం చేసే పని నిస్వార్థసేవగా ఉండాలని తద్వారా భగవంతుడి కృప లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు చంద్రశేఖర్, లక్ష్మణ్, మంజునాథ్, ఉపాధ్యాయులు శశికళ, సుజాతమ్మ, కాంతరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రిన్యాక్ ఇండియాతో ఎఫ్తా భాగస్వామ్యం


బెంగళూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): దేశీయ ఆహార రిటైల్ రిఫ్రిజిరేషన్‌కు కొత్త రూపు తీసుకొచ్చేందుకు రిన్యాక్ ఇండియా లిమిటెడ్ ఎఫ్తాతో భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. ఇటలీకి చెందిన ఎఫ్తా కంపెనీ అధికారికంగా ప్రకటించింది. నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రిన్యాక్ ఇండియా కోఫౌండర్ ఎండీ సుకుమార్ మాట్లాడుతూ.. భాగస్వామ్య ఒప్పందంతో గ్లోబల్ స్థాయిలో ఆధునికత, ప్రాంతీయ నైపుణ్యత ఒక చోటు చేరి నట్టయ్యిందన్నారు. ఎఫ్తా గ్లోబల్‌స్థాయిలో శీతలీకరణ సాంకేతికతను కలిగి ఉందన్నారు. ఎఫ్తా రిఫ్రిజిరేషన్ ఇండియా ఎండీ ఆండ్రియా క్యావలెట్ మాట్లాడుతూ విజిబిలిటీ కూలర్లు రాక్, క్రిస్టల్‌తోపాటు వివిధ రకాల ఉత్పత్తులు మా ప్రత్యేకమన్నారు.

కాగడాలతో రైతుల నిరసన

కంప్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో పరిశ్రమలకు భూములు పోగొట్టుకున్న రైతన్నలు తమ న్యాయ పోరాటం కోసం 900 రోజులకు పైగా నిరసన చేపడుతున్న ఇంతవరకు ప్రభుత్వం గానీ అధికారులు గానీ స్పందించలేదని శనివారం రైతన్నలు కుడితిని పట్టణంలో కాగడాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2010లో చిన్న పరిశ్రమల ఏర్పాటు చేస్తామని జానెకుంటి, హరిగిణదోణి, ఎర్రంగిలి, సిద్దమ్మనళ్లి, వేణి వీరాపురం, కుడితిని తదితర గ్రామాలు ఎన్ఎండీసీ మిట్టల్ తదితర పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని కొన్ని వందల ఎకరాలు తక్కువ రేట్లకే కొనుగోలు చేశారు. అప్పట్లో భూములొచ్చిన కుటుంబాల ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చి భూములు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసి సుమారు 15 యేళ్ల క్రితం ఇంతవరకు పరిశ్రమలు ఏర్పడలేదు. కుటుంబాలను పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వలేదు. కనుక రైతులు భూముల రైతులకే ఇవ్వాలంటూ పగలనక రాత్రనక నిరసనలు చేపడుతున్న ఇంతవరకు ఏ నాయకుడు తమను పట్టించుకోలేక నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం పైన పలుసార్లు జిల్లా కలెక్టర్లు లోకల్ ఎమ్మెల్యే ఎంపీ మాజీ ముఖ్యమంత్రిలు ఈవిషయం పైన ఎన్నిసార్లు తెలిపిన స్పందించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యబాబు, జంగ్లి సాబ్, తిప్పేస్వామి, సంపత్తు, తిమ్మప్ప, విటోబ, రైతన్నలు సంఘ సంస్థ నేతలు తదితరులు పాల్గొన్నారు.



కాగడాలతో నిరసనలో రైతులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1620.27	1581.29
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	64.838	604
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	198	1,995
నీటి నిల్వ (టీఎంసీలు)	61.88	5.13

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



సిరుగుప్ప, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాస శనివారం పురస్కరించుకుని పేటే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం దేశనూరు రోడ్డులో వెలసిన పురాతన, ప్రసిద్ధి చెందిన పేటే ఆంజనేయ స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అర్చకులు ధూపదీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు.

ఫ్లై ఓవర్ నిర్మించాలని

మంత్రికి వినతి



మంత్రి జమీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కంప్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని దరోజీ రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గౌడ కోరారు. శనివారం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జమీర్ అహ్మద్‌కు వారు వినతిపత్రం అందజేశారు. కంప్లి నుంచి బళ్లారి వెళ్లే మార్గం దరోజీ గేటు దగ్గర రైల్వే గేటు వద్ద రైళ్లు వచ్చినప్పుడు గేటు వేయడం వల్ల సుమారు 15 నిమిషాల నుంచి 20 నిమిషాల పాటు వేచి ఉండాల్సి వస్తోందని, ఫ్లైఓవర్ నిర్మాణంతో సమస్య తీరుతుందన్నారు. గేటు వేయడం వల్ల సమీప గ్రామాల ప్రజలు అత్యవసర చికిత్స కోసం అంబులెన్స్‌లో వెళ్తున్నప్పుడు ఇబ్బంది పడుతున్నారని, సమయానికి చికిత్స అందక మృత్యువాత పడిన సందర్భాలూ ఉన్నాయన్నారు. విద్యార్థులు, పరీక్షల సమయంలో సరైన సమయానికి హాజరు కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోజువారీ ప్రయాణికులు, ప్రజల సకాలంలో తమ గమ్యస్థానానికి చేరుకోలేక పోతున్నారన్నారు. రైల్వే ట్రాక్స్ ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు. వారితో పాటు కొట్టూరు రమేష్, గంగన్న పాల్గొన్నారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

రాయచూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శక్తినగర్ ఆర్టీపీఎస్ సీఐఎస్ఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్న రాజగోపాల్ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. రావ్ శుక్రవారం సాయంత్రం డ్యూటీ ముగించుకుని స్థానిక లక్కీ స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ సెంటర్‌లోకి వెళ్లి జిమ్ చేయడం ప్రారంభించాడు. అంతలోనే ఒక్కసారిగా కుప్పకూలి పడిపోగా పక్కనే ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లు ఆయనను కేపీసీ ఆస్పత్రికి తరలించారు. రాజగోపాల్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి శక్తినగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవలోనే..!

● గ్యారెంటీలతో అభివృద్ధి సాధ్యం కాదు: మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ప్రధాని దేవెగౌడ

రాయచూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పదవుల కోసం తాను ఏ నాడు వెంపర్లాడడం లేదని ప్రాణం ఉన్నంత వరకు పార్టీ బలోపేతం చేయడంతో పాటు ప్రజాసేవలోనే కొనసాగుతానని మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ స్పష్టం చేశారు. తనకు ఇప్పుడు 93 ఏళ్ల వయస్సు ఉందని ఎంతకాలం జీవిస్తానో ఆ భగవంతుడికే తెలుసని అయితే కొన ఊపిరి వరకు ప్రజాసేవలో ఉండాలన్నదే తన అభిమన్నారు. శుక్రవారం రాత్రి జిల్లాలోని దేవదుర్గ తాలూకాలో పార్టీ నిర్వహిస్తున్న 'జనం మధ్యలో జనతాదళ్' కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ప్రధాని, రాష్ట్ర ప్రభుత్వం పై విమర్శలు సంధించారు. గ్యారెంటీలతో సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా దివాళా తీసిందని ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి లేకుండా పోవడం దౌర్భాగ్యమన్నారు. గ్యారెంటీల పెరుతో ప్రజలను విడదీసే ప్రయత్నం చేస్తున్న పాలకుల తీరు గర్హణీయమన్నారు. తాము కులాలకు మతాలకు అతీతంగానే ప్రజలకు సేవలందించామని అదే సమయంలో అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పని చేశామని తిరిగి ప్రజల విశ్వాసం పొందుతామన్న నమ్మకం ఉందన్నారు. తమ పార్టీలోనే పెరిగి పెద్దవారైపోయిన వారు తమ పై విమర్శలు చేస్తున్నారంటూ పరోక్షంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తాము అధికారంలో ఉన్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు దేశంలో కేవలం మూడు రాష్ట్రాల్లో మాత్రమే తమకు అధికారం ఉందన్న విషయాన్ని మరిచిపోరాదన్నారు. తాము అధికారంలో లేకపోయినా ప్రజల విశ్వాసాన్ని కోల్పోలేదని, ఇందుకు మారుమూల గ్రామంలో తన విగ్రహం ఏర్పాటు చేయడమే సాక్షమని మాజీ ప్రధాని అన్నారు. తాను ఈ విషయాన్ని గర్వంగా చెప్పుకోవడం లేదని ప్రజలు తమ పై ఉంచిన నమ్మకాన్ని మాత్రమే గుర్తుచేస్తున్నానన్నారు. కాగా రాజకీయాల్లో మార్పు అవసరమన్న మాజీ ప్రధాని, యువత ఇందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తమ ప్రభుత్వం, పార్టీ పని చేస్తాయని ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

గంగమత సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

● సమాజం రాష్ట్ర సభ్యుడు మన్నూరు నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న మన్నూరు నాగరాజు

కంప్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని సమాజాలతో పాటు గంగమత సమాజం అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని కంప్లి తాలుకా గంగమత సమాజ ప్రముఖులు, రాష్ట గంగమత సమాజసభ్యులు మన్నూరు నాగరాజు అన్నారు. శనివారం కంప్లి అతిథి గృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో ప్రతి తాలుకా నుంచి ఒకరిని గంగమత సమాజం నుండి ఒకరిని సభ్యుడిగా ఎన్నుకున్నామన్నారు. త్వరలోనే తమ సమాజం నుంచి నూతన అధ్యక్షుడిని ఎన్నుకుంటామన్నారు. గంగమ సమాజాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సమాజాన్ని ఎస్టీలో చేర్చే వరకు పోరాడుదామని తెలిపారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో పర్యటించామని తమ సమాజానికి ప్రభుత్వం ద్వారా వచ్చే సదుపాయాలన్నీ నేరుగా అందేలా చూస్తామన్నారు. సిద్దప్ప కారేకల్, మనోహర్, రమేష్, నాగరాజు, శివప్ప, జెడదప్ప, వీరభద్ర, విరుపన్న, మల్లికార్జున పదాధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం: ఎస్పీ



కార్యక్రమంలో మాట్లాడుతున ఎస్పీ ఉమా ప్రశాంత్

బళ్లారి సిటీ, జూన్28(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారంగా మారుతుందని, విద్యార్థులు వాటి జోలికి పోకుండా చూడాలని ఎస్పీ ఉమాప్రశాంత్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించడానికి దావణగెరె జిల్లా పోలీస్ విభాగం దావణగెరెలోని సర్ ఎంవీ పీయూ కళాశాల సహకారంతో కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను వివరించడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఉమా ప్రశాంత్ విద్యార్థులకు సూచించి మాట్లాడారు. నేటి యువతలో మాదకద్రవ్యాల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందని, ఇది సమాజానికి ప్రమాదకరమన్నారు. ఒకసారి వాడకం ప్రారంభమైతే అది వ్యక్తి ఆరోగ్యం, మానసిక బలాన్ని భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. యువత వీటికి దూరంగా ఉండాలన్నారు. ఎవరైన వ్యక్తి కానీ విద్యార్థి మాదకద్రవ్యాలకు బానిసలాయ్యారని తెలిస్తే పోలీస్ శాఖకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కళాశాల కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో విద్యాసంస్థలు కూడా పాల్గొనాలన్నారు. మనం విద్యార్థులకు మంచి మార్గదర్శకత్వం అందించాలని, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో అవగాహన పెంచుతాయన్నారు. ఈకార్యక్రమంలో నగర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను సాంకేతికంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● బీఐటీఎం ప్రిన్సిపాల్ యడవల్లి బసవరాజు

బళ్లారి సిటీ,జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సాంకేతిక పోటీ యుగంలో విద్యార్థులను సాంకేతికంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని బీఐటీఎం ప్రిన్సిపాల్ యడవల్లి బసవరాజు అన్నారు. శనివారం బళ్లారిలోని బళ్లారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ డ్రైవింగ్ ఇన్నోవేషన్ ఇన్ ది ఫ్యూచర్ ఆఫ్ ప్రోగ్రామింగ్‌ను ప్రారంభించి అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడారు. కొత్త టెక్నాలజీని అనుభవించడం ద్వారా, ఉపాధ్యాయులు తమ జ్ఞానాన్ని సామర్థ్యాలను విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపయోగించాలన్నారు. ఏఐఎంఎల్ విభాగాధిపతి విద్యావతి ఈకార్యక్రమం యొక్క ఉద్దేశం, క్వాంటం కంప్యూటరింగ్ రంగం యొక్క అవశ్యకతను వివరించారు. ఇండియా ఏఐ,ఎన్‌క్యూఎం వంటి అనేక మిషన్లలో భారతదేశం కూడా ముందుండటం గర్వకారణమన్నారు. కార్యక్రమానికి కీలక రిసోర్స్ పర్సన్‌గా ఎన్ఐటీ రాయ్‌పూర్‌కు చెందిన డాక్టర్ కపిల్‌కుమార్ సోని పాల్గొన్నారు. ఆయన ఇస్రో ప్రతిపాదించిన ప్రాజెక్టులు, భారతదేశ -కేంద్రీకృత క్వాంటం పరిశోధన ప్రాజెక్టుల్లో పాల్గొన్నారు. తన ఉపన్యాసంలో క్వాంటం కంప్యూటింగ్ యొక్క ప్రాథమిక సూత్రాలు, పరిశోధనలో దాని అనువర్తనాలు, భవిష్యత్తు అధ్యయన పరిధులను వివరించారు. పరీక్షల కంట్రోలర్ డాక్టర్ రాఘవేంద్ర జోషి, ప్రొఫెసర్లు నూరుల్లా షరీఫ్,డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ ఫణీంద్రరెడ్డి, ప్రొఫెసర్ ప్రవీణ్‌కుమార్ డీన్‌లు, విభాగాధిపతులు, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 80మందికిపైగా అధ్యాపకులు హాజరయ్యారు. సందర్భంలో పురద్, రేణుకా తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఐటీఎం ప్రిన్సిపాల్ యడవల్లి బసవరాజు



వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటన

బళ్లారి రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): 'సలాం బళ్లారి' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి శనివారం పలువార్డుల్లో పర్యటించారు. 3వ వార్డు లాలా కమాన్ సమీపంలో ఉన్న సర్కారీ ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి రూ.కోటి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. అదేవిధంగా వార్డు ప్రజలు సమస్యలు తెలపడంతో దాదాపుగా రూ. 3 కోట్లు మౌలిక సౌకర్యాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. అనంతరం వార్డుల్లో సమస్యలపై స్థానికుల నుంచి ఆరా తీశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ రాజేశ్వరి కార్పొరేటర్లు నూర్ మహమ్మద్, మించు శీన, బీఆర్ఎల్ శీన, కాంగ్రెస్ ప్రముఖులు సుబ్బరాయుడు, హగరి గోవిందు మంజునాథ్, పాటిల్ రఘునాథ్, మహాదేవ, బసవ కిరణ్, సూరి, రాకేష్, విశ్వ తదితరులు నిర్వహించారు.

పనుల్లో నాణ్యత పాటించండి

● కాంట్రాక్టర్లకు పంచాయతీ అధ్యక్షురాలి సూచన



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న సుజాత సత్యప్ప

కంప్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరిగే పనులు నాణ్యమైన పనులు చేపట్టాలని కుడితిని పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు సుజాత సత్యప్ప కాంట్రాక్టర్లకు సూచించారు. శనివారం పట్టణంలోని 11వ వార్డులో రోడ్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో జరిగే పనులు కాంట్రాక్టర్లు నాణ్యమైన పనులు చేపట్టాలన్నారు. కుడితిని పట్టణాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిలపాలని, పట్టణాన్ని తమ నాయకులు ఎంపీ తుకారాం, ఎమ్మెల్యే అన్నపూర్ణ సహకారాలతో సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. పట్టణంలోని నాయకులు గానీ పట్టణ పంచాయతీ సభ్యులు గానీ మనస్పర్థలు వదిలి అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో తీర్థప్రసాద్, హనుమంతప్ప, వన్నూరప్ప, రవిశంకర్, మోహన్, నిరంజన్ వార్డు ప్రముఖులు పట్టణ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నదికి పెరిగిన వరద



పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

రాయచూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షల వల్ల ఆలమట్టి జలాశయానికి ఇన్ఫ్లో పెరిగి 1 లక్ష 10 వేల క్యూసెక్కుల నీటిని బయటికి విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణనదికి వరద ప్రవాహం పెరిగింది. నారాయణపూర్(బసవ సాగర) జలాశయానికి 1 లక్ష 11వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా దిగువకు 84,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో జిల్లాలో నది ప్రవాహం పెరగడం క్రమంగా ఊపందుకుంది. ఈ క్రమంలో నారాయణపూర్ జలాశయానికి ఇన్ఫ్లో ఈ మేరకు పెరిగిన దిగువకు నీటి విడుదల మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం లోతట్టు గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా లింగసుగూరు, దేవసుగూరు, రాయచూరు తాలూకాలోని కృష్ణనది తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశువులను నది తీరంలోకి మేపేందుకు వెళ్లవద్దని పొలం పనులకు వెళ్లే రైతులు సహితం తగిన జాగ్రతలు తీసుకోవాలని హెచ్చరిస్తు జిల్లా యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది.

డయాలసిస్ యంత్రాలను ప్రారంభించిన ఎంపీ



యంత్రాలను ప్రారంభిస్తున్న ఎంపీ తుకారాం, ఎమ్మెల్యే అన్నపూర్ణ

బళ్లారి సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కొత్త డయాలసిస్ యంత్రాలు పట్టణ, గ్రామీణ పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని, బాధితులు ప్రభుత్వ ఆసుపత్రి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ఈ. తుకారం అన్నారు. శనివారం పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో జిందాల్ ఫౌండేషన్ సీఎస్ఆర్ విరాళంగా ఇచ్చిన రెండు కొత్త డయాలసిస్ యంత్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఇక్కడ ఉచిత చికిత్స అందజేస్తారన్నారు. సంవత్సరానికి వెయ్యిమందికి చికిత్స అందిస్తారన్నారు. వైద్యాధికారులు పేదలకు సరైన చికిత్స అందించాలన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం. సండూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు సిరాజుస్సేన్, ఉపాధ్యక్షురాలు లత, తహసీల్దార్ అనిల్‌కుమార్, తాలూకా పంచాయతీ ఏడీసీ రేణుకాచార్యస్వామి, జిందాల్ అధినేత పెద్దన్న, ఆసుపత్రి అధికారి సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బళ్లారి సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా కంప్లి తాలూకాలోని షుగర్ ఫ్యాక్టరీ ప్రాంతంలో ఉండే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం పూర్వ విద్యార్థులు సంఘం ఇన్ఫోసిస్ కంపెనీ సీఎస్ఆర్ గ్యారెంటీ కింద కంప్యూటర్లు అందించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కిన్నరేశ్వర మాట్లాడుతూ.. తాము చదివిన పాఠశాలను చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. తాము నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా పెరిగాయన్నారు. విద్యార్థి దశ చాలా కీలమని, ఉజ్వల భవిష్యత్తుకు ఇక్కడి నుంచే పునాదులు పడాలన్నారు. కంప్యూటర్లతో పాటు ఇక ముందు కూడా యూపీఎస్‌లు, సీసీ కెమెరాలు కూడా పాఠశాలకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత విద్యార్థులు రమేష్‌రెడ్డి, వీరారెడ్డి, జయతీర్థచారి, మాధవరెడ్డి, శివేశ్వర గౌడ, టీపీ రంగస్వామి, సతీష్ ఉపాధ్యయులు గంగమ్మ, ప్రధానోపాధ్యయలు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

డీఎంకేలోకి పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మథియ జగన్

హోసూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బర్గూరు నియోజకవర్గం టోకరపల్లికి చెందిన బీజేపీ సభ్యులు కృష్ణగిరి తూర్పు జిల్లా కార్యదర్శి, బర్గూరు ఎమ్మెల్యే డీ మథియజగన్ నేతృత్వంలో డీఎంకేలో చేరారు. వారిని పార్టీ కండువాతో ఆత్మీయంగా స్వాగతం పలికారు. జిల్లా కౌన్సిల్ చైర్మన్ నాగరాజ్, డీఎంకే చీఫ్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కిరుపాకరన్, రాష్ట్ర బిజినెస్ టీం డిప్యూటీ సెక్రటరీ అన్బరసన్, జనరల్ కమిటీ సభ్యుడు నాగరాజ్, బర్గూరు యూనియన్ లీగ్ కార్యదర్శులు అరిగ్నార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● ఏడీసీ శివానంద భజంత్రి



రాయచూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల పని భారాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు సమర్థ సేవలందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ-ఆఫీసు ప్రారంభించినట్లు ఏడీసీ శివానంద భజంత్రి తెలిపారు. ఈ-ఆఫీసు నియంత్రణకు సంబంధించి అధికారులు తమకు అందుతున్న శిక్షణను సమర్థంగా వినియోగించుకోవాలని తద్వార విధులను మరింత సమర్థంగా నిర్వహించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్‌లు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌లు, గ్రామ పాలన అధికారులకు శనివారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఈ-ఆఫీసు నిర్వహణకు సంబంధించి ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన ఏడీసీ శివానంద భజంత్రి, కార్యాలయాల నిర్వహణను డిజిటల్ విధానంలో ఎలా నిర్వహించాలన్న దానిపై అధికారులు స్పష్టమైన అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ విధానం వల్ల అధికారులపై శ్రమ తగ్గుతుందనీ, మెరుగైన పారదర్శకమైన పాలన ప్రజలకు అందుతుందన్నారు.



కలెక్టర్‌ను అభినందిస్తున్న రైతు సంఘం నాయకులు

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ

హోసూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శూలగిరి పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సబ్సిడీ ఇన్‌పుట్ పంపిణీ చేశారు. వ్యవసాయ సంయుక్త డైరెక్టర్ పచ్చయ్యప్పన్ అధ్యక్షత వహించగా కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. జాతీయ వ్యవసాయ అభివృద్ధి ప్రణాళిక కింద జొన్నమొక్కలు నాటే రైతులకు పూర్తిగా సబ్సిడీ ధరలకు ఇన్‌పుట్‌లను అందచేశారు. పథకం ద్వారా రైతులకు వరి నాటే యంత్రం, నాణ్యమైన ధ్రువీకరించబడిన వరి విత్తనాలు, బయో ఫర్టిలైజర్‌లు, సూక్ష్మపోషకాలకు కూడా సబ్సిడీని అందిస్తారు. ఈ పథకం కింద యాంత్రిక మార్పిడి పద్ధతిని ఉపయోగించి వరినాట్లు వేసే రైతులకు ఒక ఎకరాకు రూ.4వేల సబ్సిడీ అందచేస్తారు. పథకం ప్రయోజనం పొందడానికి రైతులు మీ ఏరియా అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్‌ను సంప్రదించి చిట్టా, అడంగల్, ఆధార్‌కార్డు కాపీ, బ్యాంకు పాస్‌పుస్తకం కాపీ, ఫోటో వంటి వాటిని సమర్పించాలి. అలాగే 50శాతం సబ్సిడీతో నాణ్యమైన ధ్రువీకరించబడిన వరి విత్తనాలు, బయో ఫెర్టిలైజర్‌లు, సూక్ష్మక పోషక మిశ్రమాలను పొందడానికి చిట్టా, ఆధార్ కాపీని ఏరియా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయానికి సమర్పించాలనాన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి ఉద్యోగులకు సన్మానం

హోసూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): హోసూరు ఈఎస్ఐ ఆసుపత్రిలో సేవలను పూర్తి చేసుకున్న ఉద్యోగులను ఐఎన్‌టీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయంగా సత్కరించారు. ఆసుపత్రి ప్రాంగణంలో సిబ్బందిని సన్మానించారు. ఐఎన్‌టీయూసీ కృష్ణగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజ్ అధ్యక్షత వహించారు. 38 సంవత్సరాల సేవకుగాను నర్సు లతను సత్కరించారు. హోసూరులో చాలా కాలంగా నివసిస్తున్న కార్మికులకు వైద్యసేవలు అందిస్తున్న ఇద్దరు ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గీత, డాక్టర్ మహేశ్, హెడ్ నర్సు జయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు భక్తవత్సలం, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి, ఇఎస్ఐ ఇన్‌చార్జ్ శివకుమార్ పాల్గొన్నారు.



నర్సు లతను సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ సభ్యులు